# దశమ గ్రహం - దసరా కానుక

వి.వి.ఎల్.సావిత్రి

కావ్...కావ్‌మని అరుస్తున్న కాకిని స్టూలెక్కి మరీ అదిలించాడు పరాంకుశం. ఆ అదిలింపులకు భయపడని కాకి కొంచెం పక్కకి జరిగి యధా ప్రకారం అరుపు కొనసాగించింది. అసలే ఖర్చులతో సతమతమవుతున్న పరాంకుశానికి చిర్రెత్తుకొచ్చింది. కాకి అరిస్తే చాలు పరాంకుశానికి బిపి పెరిగిపోతుంది. చుట్టాలెక్కడ వస్తారో, మళ్ళీ ఎంత ఖర్చవుతుందో అని విలవిలలాడిపోతాడు. పరాంకుశం ఏడుపుకి తగ్గట్టే నలుగురు ఆడపిల్లలు. వాళ్ళంతా నాలుగు కుంపట్లై గుండె బరువు పెరిగిపోతుంటే , అష్టకష్టాలు పడి సంబంధాలు వెదికి పెళ్ళిళ్ళు చేశాడు. నాలుగో కూతురు, ముద్దుల పట్టి కాంతం పెళ్ళి కూడా ఈ మధ్యనే అయిందనిపించి చేతులు దులుపుకున్నాడు. అప్పటి నుండి తన పొదుపు పథకాన్ని పున: ప్రారంభించాడు. వరదలొచ్చినట్లు పెళ్ళయినప్పటి నుండి లెక్కలేనన్ని సార్లొచ్చి ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చున్న ఆఖరు అల్లుడి వ్యవహారం పరాంకుశానికి అస్సలు నచ్చట్లేదు. అమ్మాయినీ, అల్లుడిని తీసుకెళ్ళి దిగబెట్టి వారం రోజులు కూడా పూర్తి కాలేదు. అందుకే కాకి అరిస్తే చాలు పక్కలో అణుబాంబు పడినంత ఫీలింగ్ .

"హుష్ .. వెధవ కాకి... అరిచి అరిచి ప్రాణాలు తోడేస్తోంది " అనుకుంటూ చేతిలో ఉన్న కర్రని పెంకుల మీదకి విసిరాడు. ఆ జోరుకి ఎగిరి కాకి శాపనార్థాలు పెడుతున్నట్లుగా అరుచుకుంటూ పరాంకుశం నున్నటి గుండుమీద రెట్ట వేసి మరీ ఎగిరిపోయింది. ఇంతలో పెంకుల మీదకి విసిరిన కర్ర దొర్లుకుంటూ, దొర్లుకుంటూ వచ్చి నెత్తిమీద ఒక్కటి వడ్డించింది.

" దీనమ్మ కడుపు మాడ..." కసిగా తిట్టుకుని వాకిట్లో ఎండబెట్టిన కొబ్బరి ముక్కలకి కాపుగా ఎండలో కుర్చీ వేసుకుని, గొడుగుపెట్టుకుని కూర్చున్నాడు. ఎండ వేడికి ముక్కలతో సమానంగా ఎండిపోతున్నాడు. వాకిట్లో రిక్షా ఆగిన శబ్దమైంది. పరాంకుశం గుండె ఒక్క క్షణం మొరాయించి మళ్ళీ కొట్టుకోనారంభించింది. ఓ పక్క బిపి పెరిగిపోతుంటే భయం భయంగా గేటు దగ్గర తొంగి చూశాడు. ఆఖరు కూతురు, గారాల పట్టి కాంతం అమాంతంగా రిక్షాలోంచి కిందకి దిగింది. టక టకా రెండు సూట్ కేసులు దింపింది. పరాంకుశంపై ప్రాణాలు పైనేపోయాయ్. ఇద్దర్నీ తీసుకెళ్ళి దింపి వారం రోజులు కూడా కాలేదు. అపుడే తయారు.

" నాన్నా! బాగున్నావా? చిల్లరలేదు ఓ ఇరవై ఉంటే రిక్షా వాడికివ్వు" అంటూ తొలి 'వాలుడు' అస్త్రాన్ని సంధించింది కూతురు. ఆ దెబ్బకి చిన్న చిన్న ప్రకంపనలు మొదలయ్యాయి పరాంకుశంలో. నాలుగంగల్లో ఇంట్లోకి దూకి "ఏమేవ్ ! అమ్మాయొచ్చింది " అని వార్నింగ్ ఇచ్చి డబ్బుల కోసం గదిలోకి పరిగెట్టాడు. నూతిలో నీళ్ళు తోడుతున్న సుభద్ర గాభరాగా చేద నూతిలోనే జారవిడిచి పరుగు పరుగున ఇంట్లో దూరి బీరువా తాళాలు బిగించి బొడ్లో దోపుకుని చెంబెడు మంచినీళ్ళు గటగటా తాగేసి గుమ్మంలో చతికిలపడింది.

" ఎలా ఉన్నావమ్మా! "అంటూ తల్లిని చేరింది కాంతం.

" వారంరోజులకే ఎలా ఉన్నావంటావేంటే? చోద్యం పాడుగానూ.. " ముఖం చిట్లించింది సుభద్రమ్మ.


" ఒక్కర్తివే వచ్చావామ్మా " ఆశగా, ఆత్రంగా అడిగాడు పరాంకుశం.

"లేదు నాన్నా ఆయన వెనకాల నడిచొస్తున్నారు" మాటల్లోనే గుమ్మంలో అడుగుపెట్టాడు పెద్దిరాజు.

" బాగున్నారా? మామగారూ... చిక్కినట్లున్నారు " కుశల ప్రశ్నలు గుప్పించాడు.

కడుపు రగిలిపోతున్నా పైకి మాత్రం ఆ... అంటూ ముక్తసరిగా సమాధాన మిచ్చాడు పరాంకుశం.

కూతురు అర్ధాంతరంగా రావడం




పరాంకుశానికి నచ్చలేదు. సుభద్రమ్మ వడ్డించిన భోజనాన్ని ఆవురావురుమంటూతింటున్న పెద్దిరాజును చూస్తే పరాంకుశం కోపం నషాళానికి అంటుకుంది. పొద్దునే తన చేత్తో కొత్త బియ్యం బస్తా విప్పాడు. అపుడే అల్లుడు తయారు.

* * *

మధ్యాహ్నం కాఫీ పెడుతున్న సుభద్రమ్మని పక్కకి పిలిచి అడిగాడు పరాంకుశం. "ఎందుకొచ్చారుట?" ఏమోనంటూ పెదవి విరిచింది సుభద్రమ్మ. కాఫీగ్లాసు అందుకున్న పెద్దిరాజు తమ రాకకి స్టోరీ మొదలెట్టాడు.

" కాంతం బాగా బెంగెట్టుకుంది అత్తగారు. నన్నసలు నిలబడ నివ్వలేదంటే నమ్మండి. నాన్నా... నాన్నా.. అంటూ రాత్రిళ్ళు నిద్ర పోయేది కాదు. అందుకే శెలవలు లేకపోయినా అధాట్టున పరిగెత్తుకొచ్చాను" అని చిన్న ఇంటర్వెల్ ఇచ్చాడు.

" బెంగా? నేనెప్పుడన్నానండీ?" అంటున్న కాంతం కాలుని కస్సున తొక్కి నోరు మూయించాడు పెద్దిరాజు. కాఫీ, టిఫిన్, స్పెషల్స్‌తో భోజనం మూడు పూటలా సుష్టుగా లాగించడం, పాలేళ్ళతో, పక్కింటి, ఎదురింటి వాళ్ళతోనూ పోసుకోలు కబుర్లు చెప్పడంతోనూ కాలక్షేపం చేస్తున్న దశమ గ్రహాన్ని చూస్తే అరికాలు మంట నెత్తికెక్కింది పరాంకుశానికి.

పండువెన్నెల్లో వాకిట్లో మంచం చేసుకుని సుష్టుగా భోంచేసి సేదదీరుతున్న పెద్దిరాజు "కడుపులో గాభరాగా ఉంది. ఒక సోడా తెప్పించండి మామగారూ... "ఆర్డరు జారీ చేశాడు.

ఆ రాత్రి వేళ దగ్గర్లో సోడా దొరికే జాడ లేక ఉసూరుమని సైకిలేసుకుని సెంటర్లోకి పోయి తీసుకొచ్చాడు పరాంకుశం.

సీసా ఎత్తిపెట్టి తాగేసి " ప్చ్ పెద్దగా గాస్ లేదు "అంటూ నిట్టూర్చాడు అల్లుడు.

సోడాసీసాను అల్లుడు నెత్తిమీద పగలగొట్టాలన్నంత కోపం వచ్చింది పరాంకుశానికి.

"రేపో బుట్టడు తాటిముంజెలు తెప్పించండి . తిని చాలా కాలమైంది." మామగారికి పురమాయించి ముసుగుతన్నాడు.

" గుర్రం గుడ్డిదైనా... దాణాకు లోటు లేదు" సణుకున్నాడు మనసులో పరాంకుశం.

అసలు పరాంకుశం ఇంట్లోకి పెద్దిరాజు ఎంట్రన్స్ చాలా గమ్మత్తుగా జరిగింది. పదోతరగతి పదిసార్లు తప్పి ఇక తప్పలేనని చేతులెత్తేసిన కాంతానికి సంబంధాలు వెతికాడు పరాంకుశం. ఒక్కటీ సూటైనదీ, దీటైనది రాలేదు. పెళ్ళిళ్ళ పేరయ్య ఓ సంబంధం తీసుకొచ్చాడు.


"అత్తమామల పోరు లేదు. చిన్నపుడే పోయారు. ముగ్గురన్నదమ్ముల్లో ఆఖరువాడు. పేరు పెద్దిరాజు. మహామాటకారి. తెలివైన వాడు. మిమ్మల్ని నడివీధిలో పెట్టి మీకు తెలియకుండానే అమ్మేయగలడు. అంత తెలివైన వాడు. చురుకైన వాడు "అంటూ కితాబిచ్చాడు పేరయ్య.

" ఏమాటకామాటే చెప్పుకోవాలి. మీ కాంతానికి కొంచెం లోక జ్ఞానం తక్కువ. తెలివి తేటలు లేవు. ఇలాంటి వాణి

చ్చి చేస్తే పిల్ల జీవితం సాఫీగా వెళ్లిపోతుంది" అన్న పేరయ్య సలహా విని సరేనన్నాడు పరాంకుశం. అది మొదలు పెళ్ళి దగ్గర నుండి అలకపాన్పు సీను వరకూ షాకుల మీద షాకులిచ్చేశాడు పెద్దిరాజు.

" అల్లుడూ కొడుకు లాంటి వాడే! నాకు తండ్రిలేని లోటు తీరింది " అంటూ పరాంకుశానికి పాదాభివందనం చేశాడు.

అల్లుడు విసిరిన బౌన్సర్‌కి కుదేలైపోయాడు పరాంకుశం.



"అలకపాన్పు ఎక్కడమేంటి? నాన్సెన్స్... నేను అలగనుపొమ్మన్నాడు. అలగడం తనవల్ల కాదన్నాడు. ఆడపిల్ల తండ్రిని, అందునా మామగారిని గొంతెమ్మ కోర్కెలతో ఇబ్బంది పెట్టే కుహానా సంస్కృతికి తాను ఆమడదూరం" అన్నాడు.

"తండ్రిలాంటి మామగారిని అష్ట కష్టాలు పెట్టి ఏం బావుకోవాలని' ' అంటూ ఎర్రమార్కు ప్రశ్నలు సంధించేసరికి తట్టుకోవడం పరాంకుశం వల్లకాలేదు.

"పోనీ స్కూటరు కొనిస్తాలే బాబూ" అన్న మామగారి వంక భక్తి పారవశ్యంతో చూస్తూ "నాకో విచిత్రమైన కోరిక ఉంది మామగారూ... మీరే కొత్త స్కూటర్ తీసుకుని మీరు వాడుతున్న పాత సైకిల్ నాకు ఇచ్చేయండి. తండ్రి తర్వాత అంతటివారు.. మీ గుర్తుగా ఆ సైకిల్ వాడుకుంటాను కాదంటే నామీ దొట్టే.." అని గూగ్లీ వేసే సరికి పరాంకుశం క్లీన్ బౌల్డ్ అయిపోయాడు.

అంతే అప్పటినుండి పరాంకుశం ఇలవేల్పుగా పెద్దిరాజు సెటిలయ్యాడు. ఆ తర్వాత కానీ అల్లుడి పద్ధతి, పడికట్టు తెలిసి రాలేదు మామగారికి. నెలలో ఇరవై రోజులు మామగారింట్లోనే కాలక్షేపం. రైల్వేలో కాజువల్ లేబర్ కావడంతో వెళ్ళిన రోజు జీతం. లేని రోజు లేదు. ఉద్యోగం పోతుందన్న బాధ లేదు. అప్పటినుండి ఇలా వరదొచ్చినట్లు పరాంకుశం ఇంటికి రావడం.. ఓ పట్టాన వెళ్ళకపోవడం పెద్దిరాజుకు రోటీన్ అయిపోయింది.

మరో వారంరోజులు గడిచాక పెద్దిరాజు కాంతంలు తమ ఊరు బయలుదేరారు. స్టేషనుకొచ్చి రైలు ఎక్కించిన పరాంకుశానికి పిలుపుపెట్టాడు పెద్దిరాజు. "దసరాకి మా ఊరొచ్చేయండి మామగారు. మీరు అత్తగారు ఇక్కడ ఒంటరిగా ఏం కాలక్షేపం చేస్తారు?"

"అలాగే బాబూ తప్పకుండా. అమ్మాయి కాపురం కూడా చూడాలికదా" అని అందివచ్చిన అవకాశాన్ని పుచ్చుకున్నాడు పరాంకుశం. పండక్కి పెద్దిరాజు ఊరు బయలుదేరాడు. బయలుదేరడం ఏ మాత్రం ఆలస్యం అయినా అల్లుడు, కూతురు తారాజువ్వల్లా ఎక్కడ వచ్చేస్తారో అని రెండు రోజులు ముందుగానే బయలుదేరాడు.

" రండి! రండి! వాకిట్లోకి ఎదురొచ్చి మరీ ఆహ్వానించాడు పెద్దిరాజు. కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిచ్చి వేడి కాఫీ పెట్టించి, ఫ్యాన్ స్పీడు పెంచి, మంచం వేసి దిండు ఇచ్చి అల్లుడు చేస్తున్న సకల మర్యాదలకి పరాంకుశం డంగైపోయాడు. ఫర్వాలేదు. అల్లుడికి కూడా మనిషి లక్షణాలున్నాయి అనుకున్నాడు. తండ్రిరాకకి ఆనందించిన కాంతం టకటకా నాలుగు బొగ్గుల కుంపట్లు వెలిగించి వంట మొదలెట్టింది.

"ఇదేంటి, స్టౌ లేదా?" మామగారి ప్రశ్న పూర్తి కాకుండానే వివరణ మొదలెట్టాడు పెద్దిరాజు.

"గ్యాస్ స్టౌ ఎందుకండీ? దండగ. ఇది రాక్షసి బొగ్గు . దీనివల్ల ఏం లాభమనుకున్నారు. జస్ట్ స్టేషన్లో పనివాళ్లకి చెబితే చాలు బొగ్గుతెచ్చి ఇంట్లో పడేస్తారు. నీళ్ళు కాచుకునేందుకు, వంటకు, ఇస్త్రీకి, చలికాచుకునేందుకు ఇలా నిత్యావసరాలన్నింటికీ మేం బొగ్గే వాడతాం.కిరాణా సరుకుల వాడికి మొన్న రెండు బస్తాల బొగ్గు వేయించాను. ఇంట్లో సరుకులు అమిరాయి" అంటూ గుక్క తిప్పుకోకుండా అల్లుడు చెప్పుకుపోతుంటే పొదుపంటే పడిచచ్చే పరాంకుశం మదిలో రాశుల వర్షం కురిచినట్టైంది. " ఏజెన్సీలో ఉద్యోగం చేస్తే ఇదే లాభం... ఏమైనా సరే వచ్చేది వర్షాకాలం. అల్లుడి దగ్గరనుండి ఓ నాలుగు బస్తాల బొగ్గు కొట్టేయాలి" అని నిశ్చలంగా అనుకున్నాడు.

సాయంత్రం కాగానే "అలా ఊరు చూపిస్తా నడవండి మామగారూ..." అంటూ లేవదీశాడు పెద్దిరాజు.

"పల్లెటూరు చూసేదేముంటుంది అల్లుడూ"

పెదవి విరిచాడు పరాంకుశం.

"పోనీ టివి చూస్తారా? పక్క గదిలోనే మల్టీచానెల్ కలర్ టివి ఉన్నంత ఠీవిగా అల్లుడు ఆహ్వానించేసరికి పరాంకుశానికి చూడాలన్న కుతూహలం కలిగింది.

" లేవండి... బట్లేసుకోండి. రెణ్ణిమిషాల్లో టివిముందుంచుతాను అనడంతో ఇద్దరూ బయలు దేరారు. తన డ్యూటీ విశేషాలు, నైట్ డ్యూటీల గురించి ఏక బిగిన చెప్తూ తుప్పల్లోంచి, డొంకల్లోంచి తీసుకుపోతున్నాడు పెద్దిరాజు. పరాంకుశానికి ఆయాసం తన్నుకొచ్చింది.

" మీ ఫ్రెండింటికా అల్లుడూ! "నీరసంగా అడిగాడు.

" జస్ట్ రెణ్ణిమిషాలు ఓపిక పట్టండి. కలర్ టివి మీ ఇష్టమొచ్చినంత సేపు చూడొచ్చు "అంటూ సాగిపోతున్నాడు పెద్దిరాజు.

ఓ అరగంట నడిపించాక

"ఆ ..ఇదిగో.. వచ్చేసాం. అదుగో కలర్ టివి మీ ఇష్టమొచ్చినంత సేపు చూడండి "అంటూ అడ్డదారిన రైల్వే ప్లాట్ ఫారంపైకి చేరుకుని అక్కడ వేలాడుతున్న టివిని చూపించాడు. పరాంకుశానికి మతి పోయింది.

తానే పొదుపంటే తనను మించిన పొదుపు పాటిస్తున్న అల్లుడు చేసిన మర్యాదకి నోట మాట రాలేదు పరాంకుశానికి .

"నేనూ మీ కాంతం టివి చూడాలనిపించినపుడల్లా ఇక్కడికే వస్తామండి. రూపాయి ఖర్చులేని పని. సాయంత్రం సరదాగా నడిచినట్లూ ఉంటుంది. ఏదో ఒక బొమ్మ చూసినట్లూ ఉంటుంది" అంటూ పరవశంగా చెప్పుకుపోతున్నాడు పెద్దిరాజు. ప్లాట్ ఫాంపైనున్న ఒక పార్శిల్ బుకింగ్ ఆఫీసులోంచి ఒక చెక్క స్టూలు తీసుకొచ్చి ఒక స్తంభం వారగా వేసి మామగారిని కూర్చోమన్నాడు. స్టేషన్లో కనిపించిన ఇద్దరు, ముగ్గురు కోలీగ్స్‌ని పలకరించి రైలు ప్రమాదాలెందుకు జరుగుతాయ్ అన్న అంశంపై అనర్గళంగా ఉపన్యసించాడు పెద్దిరాజు.

ఆయాసం అనిపించాక వారికి గుడ్‌బై కొట్టి "నడవండి మామగారు.. చీకటి పడింది" అంటూ బయలు దేరాడు.

పరాంకుశానికి అల్లుడి మెంటాలిటీ అస్సలు అర్థమైచావడం లేదు. దారిలో తన కొలీగ్ ఎదురు పడితే పరిచయం చేశాడు. "మా మామగారు. నేను రెండ్రోజులు శెలవుపెడ్తున్నా. ఈ రెండు రోజులూ డే అండ్ నైట్ నువ్వే కంటిన్యూ అయిపో...423 అప్ ట్రైన్ పర్లాకిమిడి దగ్గర ఆపేసారు. పలాసా ఎక్స్‌ప్రెస్ అరగంట ఆలస్యం. ఈ రూట్ హెవీ రష్... కొత్త లైన్ వేయాల్సిందే" అంటూ మధ్య మధ్యలో మామగారి వంక చూస్తూ ఫోజుగా మాట్లాడాడు పెద్దిరాజు.

* * *

దసరా పండగ మూడు రోజులూ అల్లుడి ఇంట్లో గడిపిన పరాంకుశానికి మొహం మొత్తేసింది. కాలు కదపనీయడు. మాట మాట్లాడనీయడు. ఎపుడూ ఏదో ఒకటి వాగుతూ చిరాకు తెప్పిస్తాడు. పైగా మాటకి ముందు అతి మర్యాద. పండగ దాటిన మరుసటిరోజే "మీకు రాత్రి బండికి రిజర్వేషన్ చేయించమంటారా మామగారూ"అని నిర్మొహమాటంగా అడిగిన అల్లుడి వైఖరికి మనసులోనే మధన పడ్డాడు పరాంకుశం.

"తను మాత్రం వచ్చి నెలల తరబడి తిష్ట వేయచ్చు. నేనొచ్చి కనీసం నాలుగు రోజులు కూడా కాలేదు ఎంత నిర్మొహమాటంగా అడిగేశాడు? పెళ్ళిళ్ళ పేరయ్య చెప్పిన మాట నిజమే. నడి వీధిలో పెట్టి తెలీకుండానే వేలం వేసేయగలడు. దశమ గ్రహం" అనుకున్నాడు పరాంకుశం.

మూటాముల్లె సర్దుకున్నాడు. అల్లుడిని మళ్ళీ బొగ్గుల బస్తా ఇమ్మని అడిగేందుకు మొహమాటపడ్డాడు. కానీ పెద్దిరాజు మాట మాత్రంగా కూడా బొగ్గుల గురించి మాట్లాడటం లేదు. రిజర్వేషన్ చేయించాడు రాత్రి బండికి. చూసి చూసి ఇక పరాంకుశమే అడిగేశాడు. "వచ్చేది వర్షాకాలం... ఓ బస్తా బొగ్గుపట్టుకెళ్ళడానికి వీలవుతుందా అల్లుడుగారూ..." చేతులు నలుపుకున్నాడు పరాంకుశం

